సాక్షి
జగిత్యాల
బుధవారం । 16 । ఆగస్టు । 2023



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, పక్కన ఎస్పీ భాస్కర్, కలెక్టర్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్లు, అధికారులు



జాతీయ జెండాతో చిన్నారులు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

న్యూస్‌రీల్

పుదుచ్చేరిలో తెలంగాణ కళాకారులు



గంగాధర్ నాయక్, కళాకారులు

రాయికల్(జగిత్యాల): పుదుచ్చేరిలో జరిగిన స్వాతంత్య్ర వేడుకలకు తెలంగాణకు చెందిన యువ కళాకారులకు ఆహ్వానం అందింది. ఒడ్డె లింగాపూర్ గ్రామంలోని గంగాధర్ నాయక్ పాల్గొన్నారు. తెలంగాణ సంప్రదాయమైన బంజార నృత్యం ప్రదర్శించారు. ఈనెల 15 నుంచి 17 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఆకట్టుకున్న స్టాళ్లు



అంగన్‌వాడీ కార్యకర్తల స్టాల్

జగిత్యాలఅగ్రికల్చర్: ఖిలాలో మంగళవారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. జిల్లా వైద్య, ఆరోగ్య, నీటి పారుదల, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, పశు సంవర్థక, మిషన్ భగీరథ, జిల్లా గ్రామీణాభివృద్ధి, షెడ్యూల్ కులాల అభివృద్ధి, అటవీ, మహిళాశిశు, వికలాంగుల అభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్థక, మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ శాఖలు తాము అమలు చేస్తున్న పథకాల గురించి స్టాళ్లు ఏర్పాటు చేశాయి.

మహిళా గ్రూపులకు రూ.5కోట్ల రుణాలు

జగిత్యాలఅగ్రికల్చర్: ఖిలాలో మంగళవారం జరిగిన స్వాతంత్య్ర దినోత్సం సందర్భంగా మహిళా గ్రూపులకు రూ.50.30 కోట్ల రుణాలను మంత్రి కొప్పుల ఈశ్వర్ పంపిణీ చేశారు. బ్యాంకు లింకేజీ కింద 365 గ్రూపులకు రూ. 25.30 కోట్లు, స్త్రీనిధి కింద 2,178 గ్రూపులకు రూ.25 కోట్ల రుణాలు అందజేశారు. పట్టణ పేదరిక నిర్మూలన పథకం కింద రూ.1.50 కోట్లను మంత్రి పంపిణీ చేశారు.

భారీ పోలీసు బందోబస్తు



సందర్శకులను తనిఖీ చేస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: ఖిలాలో మంగళవారం నిర్వహించిన భారత స్వాతంత్య్ర వేడుకలకు ఎస్పీ భాస్కర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులు, అధికారులు, ప్రజలను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే ఖిలాలోని వేదిక వద్దకు అనుమతించారు. 125 మంది కానిస్టేబుళ్లు, ఎస్సైలు, సీఐలను పరేడ్ కోసం నియమించారు. డీఎస్పీ వెంకటస్వామి బందోబస్తును పర్యవేక్షించారు.

కుజదోష నివారణ పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మంగళవారం కుజదోష నివారణ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల మంత్రోచ్చారణలతో ఈ ప్రక్రియ చేపట్టారు. కుటుంబ కలహాలు, వాస్తుదోషాలు, ఆర్థిక ఇబ్బందులతో ఉన్నవారికి ఈ పూజలతో విముక్తి లభిస్తుందని అర్చకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో మొక్కులు చెల్లించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం అనంతారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామ రేషన్ డీలర్ భాస్కర్‌రావు మంగళవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. వాటి విలువ సుమారు రూ.10వేల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. పలువురు విద్యార్థులు భాస్కర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

మెట్ట ప్రాంతంలో జలసిరులు

- సంబురంగా పంటల సాగు
- వైద్యరంగంలోనూ అగ్రగామి
- సాంఘిక సంక్షేమ మంత్రి ఈశ్వర్
- ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవం
- రెపరెపలాడిన మువ్వన్నెలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి ఈశ్వర్

జగిత్యాల: జిల్లాలోని మెట్టప్రాంతంలోనూ జలసిరులు సాగును సంబురం చేస్తున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. వేసవిలోనూ మత్తళ్లు దూకుతున్నాయన్నారు. ఖిలాలో మంగళవారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి జాతీయ పతాకం ఆవిష్కరించి మాట్లాడారు. సంక్షోభంలోని తెలంగాణను సుజలాం.. సుఫలాం.. సస్యశ్యామలంగా తయారు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు.

వైద్య రంగంలో అగ్రగామి..

- జిల్లాలో వైద్య కళాశాల అందుబాటులోకి వచ్చిందని, రూ.510 కోట్ల వ్యయంతో భవన నిర్మాణం శరవేగంగా సాగుతోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు.
- గర్భిణుల కోసం 100 పడకల ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చామని ఆయన అన్నారు. కోరుట్ల పట్టణంలో 100 పడకలు, మెట్‌పల్లిలో 50 పడకల ఆస్పత్రుల భవన నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని తెలిపారు.
- 33,587 మందికి కేసీఆర్ కిట్లు అందజేశామని, టీ హబ్ ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నామని చెప్పారు.
- రెండోవిడత కంటివెలుగులో జిల్లావ్యాప్తంగా 6,34,274 మందిని పరీక్షించి 79,096 రీడింగ్ అద్దాలు, 1,04,424 ప్రిస్కిప్షన్ కంటి అద్దాలు అందించామని కొప్పుల అన్నారు.
- రూ.204 కోట్లతో తొలివిడతలో 17,448 గొర్రెల యూనిట్లు అందించామని, రూ.1.80 కోట్లతో రెండో విడతలోనూ అందిస్తామని చెప్పారు. గాయపడిన గీతకార్మికులకు తక్షణ వైద్య సేవలకు రూ.కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు.

ఇంటింటికీ మిషన్ భగీరథ..

- మిషన్ భగీరథ ద్వారా రూ.1,740 కోట్ల వ్యయంతో 497 ఆవాసాల్లోని 9.88 లక్షల జనాభాకు సురక్షిత తాగునీరు అందిస్తున్నామని కొప్పుల చెప్పారు. జిల్లాకు 8,770 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 4,486 ఇళ్లు పూర్తయ్యాయని, ఇందులో 986 ఇళ్లను పేదలకు అందించామని తెలిపారు. ఇప్పటివరకు 7.88 కోట్ల మొక్కలు నాటి, వెయ్యి హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ పునరుద్ధరణ పనులు ప్రతిపాదించామని అన్నారు. అర్హులైన వారికి ప్రతినెలా పింఛన్ అందిస్తున్నామని తెలిపారు. మహిళా సాధికారత కోసం వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కూలీలకు ఉపాధిహామీ ద్వారా 100 రోజుల పని కల్పిస్తున్నామన్నారు. కల్యాణ లక్ష్మి ద్వారా 35,226 మంది, షాదీముబారక్ ద్వారా 3,936 మందికి ఆర్థిక సాయం అందించామని చెప్పారు. రూ.69 కోట్లతో డబుల్ రోడ్లు నిర్మిస్తున్నామని, వంతెనల అభివృద్ధి పనులు ప్రగతి దశలో ఉన్నాయన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 1,168 పనులకు రూ.330 కోట్లు కేటాయించామని అన్నారు. దళితబంధు కింద నియోజకవర్గానికి 1100 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి ద్వారా విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఆదర్శ వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని చెప్పారు. విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. జిల్లాలోని 703 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు, 70 మందికి స్కూటీలు, 19 మందికి వీల్‌చైర్లు, 141 మందికి పునరావాసం కింద రూ.80 లక్షల రాయితీ అందించామని అన్నారు. మత్స్యకారులకు ఉపాధి మెరుగు పర్చేందుకు 239 సొసైటీల పరిధిలోని 685 చెరువులు, కుంటల్లో 1.47 కోట్ల చేపపిల్లలను విడుదల చేశామని, వెయ్యి టన్నుల చేపలు, 50 టన్నుల రొయ్యలు ఉత్పత్తయ్యాయని తెలిపారు. 15 మంది గిరిజనులకు 18.62 సెంట్ల పోడుభూములకు పట్టాలు అందించామని అన్నారు.
- ఏటా రూ.100 కోట్లకు పైగా నిధులు వెచ్చించి 1,34,214 వ్యవసాయ బావులకు 24 గంటలపాటు ఉచిత కరెంట్ అందిస్తున్నామని తెలిపారు. లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి 296 ట్రాన్స్‌ఫార్మర్లు బిగించామన్నారు. రజక, నాయీ బ్రాహ్మణులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు.

ఆయకట్టుకు సాగునీరు..

- రోళ్లవాగు ప్రాజెక్ట్ ద్వారా 20 వేల ఎకరాలకు సాగునీరు అందుతోందని మంత్రి అన్నారు. ధర్మపురి మండలం కమలాపూర్ బోలిచెరువు నీటి నిల్వ సామర్థ్యం 0.175 టీఎంసీల నుంచి 0.350 టీఎంసీలకు పెంచడానికి రూ.4.88 కోట్లు వెచ్చించామన్నారు. 'ఎల్లంపల్లి'లో ముంపునకు గురైన రాంనూర్, కోటిలింగాల, ముక్కట్రావ్‌పేట, తాళ్లకొత్తపేట, చెగ్యాం గ్రామాలకు చెందిన 348 మందికి రూ.2 లక్షల చొప్పున వన్‌టైం సెటిల్‌మెంట్ చేశామని చెప్పారు. గృహలక్ష్మి కింద రూ.3లక్షలు అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. మిషన్ కాకతీయ ద్వారా ఇప్పటివరకు రూ.67.30 కోట్లతో 263 చెరువులు అభివృద్ధి చేశామని తెలిపారు. రూ.91 కోట్లతో 35 చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఒక్కొక్కరికి 6 కేజీల చొప్పున 3,07,598 కార్డుపై 5.597 టన్నుల పోషక విలువలతో కూడిన బియ్యం ఉచితంగా పంపిణీ చేశామని చెప్పారు. విద్యార్థులకు సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. ధాన్యం సేకరణకు 418 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

పల్లెలు అభివృద్ధి..

పల్లెప్రగతి ద్వారా పచ్చదనంతో పల్లెలు కళకళలాడుతున్నాయని, 380 గ్రామపంచాయతీల్లో ట్రాక్టర్లు ఇవ్వడంతోపాటు, ప్రతీ గ్రామపంచాయలో కంపోస్ట్‌షెడ్లు, వైకుంఠధామాలు, ప్రకృతి వనాలను ఏర్పాటు చేసుకున్నామని కొప్పుల చెప్పారు. పరిపాలన సౌలభ్యం కోసం బీమారం, ఎండపల్లి మండలాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. బీసీ, ఎంబీసీ కులవృత్తులకు రూ.లక్ష గ్రాంట్ కింద నియోజకవర్గానికి 300 చొప్పున తొలివిడతలో 900 మందికి రూ.9 కోట్లు అందించామని చెప్పారు. 653 మంది వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేశామని, 183 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి కల్పించామని తెలిపారు. పెండింగ్ మ్యుటేషన్లు, కోర్టు కేసులు సహా 22,240 ధరణి దరఖాస్తులకు పరిష్కారం చూపించామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణలో పోలీసు శాఖ అత్యాధునిక పరిజ్ఞానంతో అహర్నిశలు శ్రమిస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్, ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు, రవిశంకర్, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, అదనపు కలెక్టర్లు లత, దివాకర, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, మున్సిపల్ చైర్మన్లు గోలి శ్రీనివాస్, మోర హన్మండ్లు, ఆర్డీవో నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, కలెక్టర్ యాస్మిన్‌బాషా తదితరులు



రాయికల్: విచిత్ర వేషధారణలో చిన్నారులు





జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఖిలాలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు



జగిత్యాలటౌన్: ఖిలాలో జరిగిన వేడుకల్లో నృత్యం చేస్తున్న బాలికలు



జగిత్యాలటౌన్: ఆకట్టుకున్న వేషధారణ



జగిత్యాలటౌన్: త్రివర్ణ పతాకంతో..

పాపం.. పంచాయతీరాజ్

- డీపీవో విభాగానికి దక్కని గుర్తింపు
- స్వాతంత్య్ర దినోత్సవం వేళ ఉద్యోగులకు అందని ప్రశంసలు

కోరుట్ల: బీసీబంధు.. వరదలు.. గృహలక్ష్మి.. స్వచ్ఛ సర్వేక్షణ్.. ఇలా ఒకటేమిటీ.. ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాల్లో పంచాయతీరాజ్ ఉద్యోగుల పాత్రకీలకం. ఎంపీవోలు, కార్యదర్శులు, ఎంపీడబ్ల్యూవోలు.. ఇలా ఏస్థాయిలోని వారికైనా పనిభారమే. ఇంత చేస్తున్నా తమకు సరైన గుర్తింపు దక్కడం లేదని కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మంగళవారం జరిగిన స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఒకరిద్దరికే ప్రశంస పత్రాలు అందడంపై నిరాశ చెందుతున్నారు.

ప్రతిష్టాత్మక పథకాల్లో కీలకం..

- ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీబంధు పథకం అర్హుల సర్వేను పంచాయతీరాజ్ డీపీవో విభాగానికి చెందిన కార్యదర్శులు, సిబ్బంది ఇటీవల నిర్వహించారు.
- జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇచ్చే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు పోటీలోనూ పరిశీలకుల మెప్పు పొందారు.
- ప్రస్తుతం గృహలక్ష్మి పథకం కింద వచ్చిన దరఖాస్తుల వడపోతలో ఇంటింటి సర్వే చేస్తున్నారు.
- వరదల ధాటికి దెబ్బతిన్న పంటలు, నష్టనివారణ చర్యలు, పునరావాస కల్పన వంటి పనులను నిర్విరామంగా నిర్వహించారు.
- వర్షాల అనంతరం ప్రబలే వ్యాధులను సమర్థంగా నిరోధించడంలోనూ ఎంపీడబ్లూవోలు అందరూ విశేషంగా కృషి చేశారు.
- ఈ అంశాన్ని ఇటీవల జరిగిన ఓ సమావేశంలో జిల్లా మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశంసించారు.

దక్కని గుర్తింపు..

జిల్లా పంచాయతీరాజ్ శాఖ డీపీవో విభాగం నుంచి ఓ డీఎల్‌పీవో, మరో జూనియర్ అసిస్టెంట్‌కు మాత్రమే స్వాతంత్య్ర దినోత్సవ వేళ ప్రశంస పత్రాలు దక్కడం ఉద్యోగుల్లో నిరాశ నింపింది. ప్రతీ పథకాన్ని క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయడానికి సహకరిస్తున్న కార్యదర్శులు, ఎంపీవోలు, ఎంపీడబూల్యవోల్లో ఎవరికి ప్రశంస పత్రాలు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.



గృహలక్ష్మి సర్వే చేస్తున్న ఉద్యోగులు

భవిష్యత్‌లో అవకాశం



ఈసారి పంచాయతీరాజ్ డీపీవో విభాగం నుంచి నలుగురికి ప్రశంస పత్రాలు ఇవ్వాలని ప్రతిపాదించాం. ఇద్దరికి అవకాశం దక్కింది. దీంట్లో పెద్దగా ఇబ్బంది ఏమీలేదు. వచ్చే జనవరి 26(గణతంత్ర) వేడుకల్లో మళ్లీ ప్రశంస పత్రాలు ఇవ్వడానికి అవకాశముంది. పనిచేస్తే తప్పక గుర్తింపు ఉంటుంది. నిరాశ చెందాల్సిన అవసరం లేదు.

– దేవరాజ్, డీపీవో, జగిత్యాల

గుర్తింపు ఉండాలి



సంక్షేమ పథకాల్లో కీలకంగా పనిచేస్తున్న పంచాయతీరాజ్ డీపీవో విభాగం సిబ్బంది చాలా శ్రమిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధికి పాటు పడుతున్నారు. శ్రమకు తగిన గుర్తింపు దక్కితే మరింత ఉత్సాహంగా పనిచేస్తారు. ప్రశంస పత్రాలు ఒకరిద్దరికే ఇవ్వడం నిరుత్సాహానికి గురిచేసింది.

– రవిబాబు, ఎంపీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రగతి నివేదిక సత్యదూరం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: సీఎం కేసీఆర్ సహా మంత్రులు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా చేసిన ప్రసంగాలు సత్యదూరంగా ఉన్నాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. స్థానిక ఇందిరాభవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంద్రాగస్టు వేడుకల సందర్భంగా చెప్పిన ప్రగతిలో పదిశాతం కూడా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే సంక్షేమ పథకాల్లో అర్హుల ఎంపికకు కొలమానంగా భావించే రేషన్‌కార్డుల జారీ నాలుగేళ్ల క్రితమే నిలిపివేసిందని దుయ్యబట్టారు. కేసీఆర్ ప్రతీమాట వెనుక ఓ మర్మం, కుట్ర దాగి ఉంటాయని మండిపడ్డారు. హామీల అమలుపై వాస్తవాలు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, జున్ను రాజేందర్, గుండ మధు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ జెండాతో స్కేటింగ్



స్కేటింగ్ చేస్తున్న బాలుడు

జగిత్యాలరూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన ఓ బాలుడు జాతీయ జెండాతో స్కేటింగ్ చేస్తూ దేశభక్తిని చాటుకున్నాడు. కొత్తబస్టాండ్– కరీంనగర్‌రోడ్డులో జాతీయ జెండాతో స్కేటింగ్ చేస్తున్న బాలుడిని చూసి స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

ధర్మారం సర్పంచ్‌పై డీపీవోకు ఫిర్యాదు

కోరుట్లరూరల్: ధర్మారం సర్పంచ్‌పై ఉప సర్పంచ్ పొలాస రాజమురళి, వార్డు సభ్యులు పి.సునీత, ఎం.లత, ఇ.రాజేందర్ సోమవారం సాయంత్రం జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. సర్పంచ్ విధులు సరిగా నిర్వహించడం లేదని, సర్పంచ్ భర్త అనధికారికంగా సర్పంచ్ విధులు నిర్వహిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మృతురాలి కుటుంబానికి కొప్పుల పరామర్శ



బాలిక కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి

గొల్లపల్లి(ధర్మపురి): ఆత్మకూర్ గ్రామానికి చెందిన సంగెపు శంకర్–రాజేశ్వరి దంపతుల కూతురు సాహిత్య ఇటీవల కుక్కకాటుకు మృతిచెందింది. సమాచారం అందడంతో మంత్రి కొప్పుల ఈశ్వర్ మంగళవారం బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. అన్నివిధాలా ఆదుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

తిరుమలలో మల్యాలవాసి ఆత్మహత్యాయత్నం

మల్యాల(చొప్పదండి): మల్యాలకు చెందిన చేనేత కార్మికుడు దుంపేటి తులసీరాం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమల తిరుపతికి వెళ్లి అక్కడే ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. తులసీరాం శనివారం మల్యాల నుంచి రైలులో బయలు దేరి తిరుపతి చేరుకున్నాడు. మంగళవారం తెల్లవారుజామున తిరుమలలో చెయ్యి, గొంతును కత్తితో కోసుకున్నాడు. సిబ్బంది గమనించి వెంటనే శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తరలించి, చికిత్స అందిస్తున్నారు. క్యూలైన్లలో జరిగిన గొడవ కారణంగా ఆత్మహత్యయత్నానికి పాల్పడి ఉంటారని కుటుంబ సభ్యులు తెలిపారు. తులసీరాం ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారని వారు వివరించారు. బాధితుడి వద్దకు కుటుంబ సభ్యులు బయలుదేరి వెళ్లారు.

ప్రతిభకు పురస్కారాలు



మంత్రి ఈశ్వర్ నుంచి అవార్డు అందుకుంటున్న డీడబ్ల్యూవో నరేశ్

జగిత్యాలటౌన్: విధి నిర్వహణలో ప్రతిభ చూపిన, సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం పురస్కారాలు అందజేశారు. జిల్లా కేంద్రంలోని చారిత్రక ఖిల్లాలో పంద్రాగస్టు వేడుకల్లో మంత్రితోపాటు అధికారులు అవార్డులు అందజేశారు. వివరాలు..



కె. లక్ష్మీనారాయణ, పీడీ, డీఆర్డీవో | సురేశ్‌కుమార్ డీఏవో | సత్యనారాయణ, ఎస్‌ఈ, ట్రాన్స్‌కో | లక్ష్మీనారాయణ, సీఐ, మెట్‌పల్లి | నాగేశ్వర్‌రావు, సీఐ | అశోక్, ప్రిన్సిపాల్



రాజేశ్వర్, డీఈ, హౌసింగ్ | పి.శ్రీనివాస్, డీఎల్పీవో | పి.నరేశ్, అదనపు డీఆర్డీవో | ప్రకాశ్, డీఎంవో, మార్కెటింగ్ | గంగుల సంతోష్, మున్సిపల్ కమిషనర్ | సంధాని, ఏఎస్‌ఐ, ట్రాఫిక్



గంగాధర్, ఇంటలిజెన్స్ | దక్షిణమూర్తి, ఆర్డీవో ఆఫీస్ | రవీందర్, ఎల్‌ఎస్‌ఏ | ప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ | కొండయ్య, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ | పరశురాంగౌడ్, టీఎస్‌ఎస్ | ప్రదీప్, ఓఎస్(పీఆర్వో) | ఖాన్, ఓఎస్ (కలెక్టరేట్)

కుష్ఠు నిర్మూలన లక్ష్యం

- అనుమానితుల గుర్తింపు కోసం సర్వే
- రంగంలోకి దిగిన 744 వైద్య బృందాలు
- నేటినుంచి జిల్లావ్యాప్తంగా అధికారుల పర్యటన

కథలాపూర్(వేములవాడ): చర్మం, నరాలకు సోకే జబ్బుల్లో ప్రధానమైనది కుష్ఠు. ఇది జిల్లాలో చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఆదిలో గుర్తించడం చాలా కష్టమని వైద్యులు చెబుతున్నారు. సుమారు మూడేళ్ల తర్వాత గానీ వ్యాధి లక్షణాలు బహిర్గతం కావంటున్నారు. అయితే, ఆరంభంలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే వ్యాధిని నిర్మూలించే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 16 నుంచి 31వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ఇంటింటా సర్వే చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ నిర్ణయించింది.

సర్వేకు 744 వైద్య బృందాలు

- జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలుండగా 380 గ్రామాలున్నాయి. మొత్తం 2,43,367 కుటుంబాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.
- అయితే, కుష్ఠు గుర్తింపు కోసం ఇంటింటా సర్వే చేసేందుకు 744 వైద్య బృందాలను నియమించారు.



సర్వే చేస్తున్న వైద్య బృందాలు(ఫైల్)

- ఇందులో ఏఎన్‌ఎం, ఆశవర్కర్, మగ వైద్యసిబ్బంది ఉంటారు.
- సర్వేను పర్యవేక్షించేందుకు 65 మంది అధికారులను నియమించారు.

పకడ్బందీగా సర్వే



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా వైద్యసిబ్బందితో ఇంటింటా సర్వే చేస్తాం. అనుమానితులను గుర్తించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తాం. కుష్ఠు లక్షణాలు ఉన్నట్లు తేలితే చికిత్స అందిస్తాం. బాధితులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తాం. వ్యాధిగ్రస్తులు సరైన మందులు వాడకపోతే ఇతరులకు వ్యాపించే ప్రమాదం ఉంది. సర్వేకు ప్రజలు సహకరించాలి.

– శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి

- వీరితోపాటు ఐదుగురు ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు, 24 మంది వైద్యాధికారులు నిరంతరం తనిఖీలు చేస్తారు.
- కుటుంబ సభ్యుల శరీరంపై తెల్ల, నల్ల, ఇతర మచ్చలు గుర్తించి నమోదు చేస్తారు.
- అనుమానితులను స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని వైద్యులకు రెఫర్ చేస్తారు.

జిల్లాలో 84 మంది వ్యాధిగ్రస్తులు

జిల్లాలో ఇప్పటికే 84 మంది వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరికి చికిత్స అందిస్తున్నారు. ప్రతినెలా పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. మరోవైపు.. ఈ నెలాఖరు వరకు కొత్తగా కుష్ఠు బాధితులను గుర్తించేందుకు చేపట్టే సర్వేలో వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గుతుందా? పెరుగుతుందా? అనేది తేలుతుంది.

- ఈనెల 16న ప్రారంభమై 31వ తేదీన సర్వే ముగుస్తుంది.
- సర్వేలో పాలుపంచుకునే సిబ్బందికి ఇప్పటికే వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. వీరు క్షేత్రస్థాయిలో అనుమానితులను గుర్తిస్తారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

బుగ్గారం(ధర్మపురి): అప్పుల బాధ భరించలేక జీవితంపై విరక్తి చెంది రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిన్నాపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు కొడిమ్యాల రామస్వామి(55) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల కూతురు వివాహం చేశాడు. ఇందుకోసం కొంత అప్పయ్యింది. వ్యవసాయ పనులకు మరికొంత అప్పు చేశాడు. వాటిని తీర్చే దారిలేకపోవడం, మరోవైపు ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో మంగళవారం ఊరుబయట గుట్టల ప్రాంతంలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. సమీపంలో ఉన్న పశువులకాపరులు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని రామస్వామిని జగిత్యాలలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య కళావతి, కుమారుడు చందూ, కూతురు సుమ ఉన్నారు.

అక్రమంగా ఆయుధం కలిగిన వ్యక్తి అరెస్టు

- పిస్టల్, ఆరు బుల్లెట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటస్వామి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటస్వామి

మల్యాల(చొప్పదండి): వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా ఆయుధం కలిగిన వ్యక్తిని పట్టుకుని ఒక పిస్టోల్, ఆరు బుల్లెట్లు స్వాధీనం చేసుకున్న సంఘటన రాజారం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ వెంకటస్వామి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజారం గ్రామంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా, జగిత్యాల నుంచి కరీంనగర్‌వైపు వెళ్తున్న వాహనదారు వారిని తప్పించుకుని వెళ్లేందుకు యత్నించాడు. ఎస్సై కుమారస్వామి అప్రమత్తమై వాహనదారును పట్టుకున్నారు. ముస్తాబాద్ గ్రామానికి చెందిన గూడెం మహేందర్‌గా నిందితుడిని గుర్తించారు. అతడు ముస్తాబాద్‌లో దత్తసాయి గార్డెన్స్ ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నాడు. అతడి నుంచి ఒక పిస్టోల్, ఆరు తూటాలు స్వాధీనం చేసుకున్నారు. రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో కొందరితో మహేందర్‌కు వివాదాలు ఉన్నాయి. వీటిని పరిష్కరించుకునేందుకు పిస్టల్ అవసరమని భావించాడు. బిహార్‌లోని గోపాల్ గంజ్ పట్టణంలో లభిస్తాయని ఫంక్షన్ హాల్ నిర్మాణ సమయంలో పనిచేసిన కూలీలు చెప్పడంతో 2020 నవంబర్‌లో మహేందర్ రైలులో అక్కడకు వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఒక పిస్టల్, ఆరు తూటాలను రూ.50వేలకు కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి పిస్టల్, తూటాలను పట్టుకుని భూములు, డబ్బులను బలవంతంగా రికవరీ చేయాలని తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మహేందర్ ముస్తాబాద్ నుంచి జగిత్యాల వచ్చాడు. ఆ తర్వాత తన ద్విచక్ర వాహనంపై తిరిగి ముస్తాబాద్ వెళ్తుండగా మధ్యాహ్నం రాజారం గ్రామంలో ఎస్సై ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి ఒక పిస్టోల్, ఆరు తూటాలు, ఒక ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వివరించారు. కార్యక్రమంలో సీఐ కోటేశ్వర్, ఎస్సై తీగల అశోక్, కె.కుమారస్వామి పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

కోరుట్లరూరల్: నాగులపేట గ్రామానికి చెందిన పడాల మోహన్‌రెడ్డి(57) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. మోహన్‌రెడ్డి కొంతకాలం క్రితం మతిస్థిమితం కోల్పోయారు. అనారోగ్య సమస్యలతోనూ బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఒక్కడే బయటకు వెళ్లాడు. ఇంటి తలుపులకు గడియ పెట్టాడు. దాని ఎదుట ఉన్న రేకులకు ఉరివేసుకుని చనిపోయాడు. మంగళవారం ఉదయం కుమారుడు గంగాప్రసాద్ నిద్ర లేచి బయట తలుపు తీసే ప్రయత్నం చేయగా తెరుచుకోలేదు. మోహన్‌రెడ్డి భార్య కిటికీ తలుపులు తెరిచి చూడగా భర్త ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. ఆమె గట్టిగా అరవటంతో ఇరుగుపొరుగు వారు వచ్చి తలుపు గడియ తీశారు. మృతుడి కుమారుడు పడాల గంగాప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని మొలంగూర్ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల వివరాలు.. మొలంగూర్‌కు చెందిన రాణవేని తిరుపతి కుటుంబసభ్యులతో కలిసి సోమవారం కరీంనగర్‌లో శుభకార్యానికి వెళ్లారు. అదే రోజు రాత్రి ఇంటికి రాగా తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువా తెరిచి ఉండి వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. బీరువాలో దాచిన రూ.20వేల నగదు, 20తులాల వెండి, అరతులం బంగారం వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. మంగళవారం కేశవపట్నం పోలీసులకు సమాచారమివ్వగా సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై లక్ష్మారెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించారు.

కుటుంబ సభ్యులకు వృద్ధుడి అప్పగింత

యైటింక్లయిన్‌కాలనీ: పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సుందిళ్ల, ముస్త్యాల గ్రామాల శివారులో ఊబిలో చిక్కుకున్న వృద్ధుడిని గోదావరిఖని టూటౌన్ బ్లూకోల్ట్స్ పోలీసులు అతడి బంధువులకు అప్పగించారు. బురదలో పడిపోయిన వృద్ధుడిని పోలీసులు కాపాడి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించిన విషయం తెల్సిందే. సోషల్ మీడియా, పత్రికల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. మంచిర్యాల జిల్లా, జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన మోతే భిక్షం (70) కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బుల్డోజర్ ఆపరేటర్ మృతి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ చౌరస్తాలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. స్థానికుల వివరాలు.. కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లోని ఎస్వీజీ గ్రానైట్ కంపెనీలో బుల్డోజర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న టి.శ్రీనివాస్ (40) ఇంటికి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. పంద్రాగస్టు వేడుకను పురస్కరించుకొని గ్రానైట్ కంపెనీలో జెండా పండగలో శ్రీనివాస్ పాల్గొన్నాడు. అనంతరం తోటి కార్మికులతో విందులో పాల్గొన్నట్లు తెలిసింది. విందు ముగించుకొని కమాన్‌పూర్ నుంచి కరీంనగర్‌లోని శివ థియేటర్ వద్ద ఉన్న తన ఇంటికి వస్తున్న క్రమంలో శాతవాహన యూనివర్సిటీ చౌరస్తాలో బైక్ అదుపు తప్పి రేలింగ్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్ రేలింగ్‌కు చిక్కుకోగా, శ్రీనివాస్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్టు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కనుకుల గ్రామ శివారులో మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై విజేందర్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి రూ.6,230 స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరంతా వివిధ వైన్స్ షాపుల్లో పనిచేసే వారీగా గుర్తించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. మండలంలోని మడిపల్లి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై కోతి మృతి చెందగా, దానిని తొలగించే క్రమంలో అదే గ్రామానికి చెందిన ముకుంద సతీశ్ (54) విద్యుత్ షాక్ గురై కింద పడిపోయాడు. పక్కన ఉన్న సపోర్టు స్తంభంపై పడగా తలకు తీవ్ర గాయాలైనాయి. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య లత, కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు ఫణిందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రవి తెలిపారు. కాగా సదాశివ ఫౌండేషన్‌కు మృతుడి కళ్లు దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన రాదారపు చంద్రయ్య(55) చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీఐ రాజ్‌కుమార్ వివరాలు.. చంద్రయ్య రెండు, మూడేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదు. కడుపునొప్పి భరించలేక ఈ నెల 13న రాత్రి ఇంటి వద్ద గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య బక్కవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి గ్రామ సమీప రాజీవ్ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల (దేవాపూర్)కు చెందిన యువకుడు (22) ద్విచక్రవాహనంపై కరీంనగర్‌కు వెళ్తున్నాడు. దుబ్బపల్లి వద్దకు రాగానే అదుపుతప్పి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు, పోలీసులు అతడిని కరీంనగర్ అసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహం

మంథని: పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఆరెంద గ్రామ సమీపంలోగల గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని మంగళవారం గుర్తించినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నదిలో శవం ఉందనే సమాచారం మేరకు అక్కడకు పోలీసులు వెళ్లారు. మృతదేహానికి మొలతాడు, కడెం ఉన్నాయని, గ్రామ కారోబార్ రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

లాభదాయకంగా డ్రాగన్ ఫ్రూట్ సాగు

- చిన్నమెట్‌పల్లిలో పండిస్తున్న రైతు రాజేందర్
- ఎకరం విస్తీర్ణంలో సాగు
- ఆర్గానిక్ ఎరువుల వినియోగం



డ్రాగన్ ఫ్రూట్ కోస్తున్న రైతు



డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు

కోరుట్లరూరల్: కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లి గ్రామానికి చెందిన సంది రాజేందర్ తనకున్న ఎకరం విస్తీర్ణంలో డ్రాగన్‌ఫ్రూట్ పంట పండిస్తున్నాడు. మొత్తం 5 ఎకరాలు ఉండగా.. రెండెకరాల్లో మామిడి, ఎకరంలో వరి, మరో ఎకరంలో మొక్కజొన్న పండిస్తున్నాడు. మిగిలిన ఎకరంలో డ్రాగన్ ఫ్రూట్ సాగుచేస్తున్నాడు.

అమెరికన్ బ్యూటీ రకం..

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపే గ్రామానికి చెందిన డ్రాగన్‌ఫ్రూట్ పంట పండిస్తున్న రైతు రాంచందర్ ద్వారా అమెరికన్ బ్యూటీ రకం విత్తనం మొక్కలు(స్టీమ్) కొనుగోలు చేసిన రాజేందర్.. వాటిని తన చేనులో నాటాడు. చేనులో సిమెంట్ రింగ్‌పోల్స్ వేశాడు. ఒకపోల్ నుంచి మరోపోల్‌కు మధ్య కనీసం 8 అడుగుల దూరం, ఒక్కో వరుసకు 10 అడుగుల దూరం తేడాతో మొక్కలు నాటాడు. ఏడాది క్రితం సాగు ప్రారంభించాడు. పూతపూసిన 45 రోజుల తర్వాత కాయలు పండ్లుగా మారాయి. ప్రస్తుతం కోత దశకు చేరాయి. సంవత్సరంలో సుమారు రూ.6 లక్షల నుంచి రూ.6.5 లక్షలు పెట్టుబడి కోసం ఖర్చయినట్లు రైతు రాజేందర్ తెలిపాడు.

ఆర్గానిక్ ఎరువుల వినియోగం..

డ్రాగన్‌ఫ్రూట్ పంట కోసం ఆర్గానిక్ ఎరువులు వినియోగిస్తున్నానని రాజేందర్ తెలిపాడు. పశువుల పేడతోపాటు కోళ్ల, గొర్రెల ఎరువులు వినియోగిస్తున్నానని చెప్పాడు. ప్రతీ నాలుగు నెలలకోసారి ఎరువులు వేస్తున్నట్లు వివరించాడు. వందశాతం సొంత ఖర్చుతోనే డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిన మొక్కలకు నీళ్లు అందిస్తున్నాడు. ఏడాదిక్రితం 12 ఇంచుల స్టీం (విత్తనం మొక్క) నాటగా ప్రస్తుతం ఐదు ఐదు అడుగుల ఎత్తుకు పెరిగింది.

మొదటి సంవత్సరం టన్ను దిగుబడి..

ప్రతీ సంవత్సరం జూన్ నుంచి డిసెంబర్ వరకు పంట కోతకు వస్తుందని రైతు తెలిపాడు. మొక్కలకు రాత్రి వేళల్లో లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి వెలుగునిస్తే.. సంవత్సరం మొత్తం దిగుబడి వస్తుందని తెలిపాడు. మొదటి సంవత్సరం ఒక టన్ను ఫ్రూట్స్ దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నాడు. రెండో ఏడాది నాలుగు నుంచి ఐదు టన్నులు, మూడో సంవత్సరం నుంచి 10 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని రాజేందర్ పేర్కొన్నాడు. ఫ్రూట్ బరువు 300 గ్రాముల నుంచి 400 గ్రాముల వరకు ఉంటుందన్నాడు.

లోకల్ మార్కెట్‌లోనే విక్రయం..

డ్రాగన్ ఫ్రూట్స్‌ను ప్రస్తుతం లోకల్ మార్కెట్‌లోనే విక్రయించే ఏర్పాట్లు చేస్తున్నట్టు రైతు పేర్కొన్నాడు. జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నానని వివరించాడు. డ్రాగన్‌ఫ్రూట్‌లో రక్త కణాలు పెంచే ఔషధ గుణాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారని, దీంతో ఈ పండ్లకు మంచి గిరాకీ ఉండే అవకాశం ఉందని పేర్కొన్నాడు. దిగుబడి పెరిగేకొద్దీ గంపగుత్తగా విక్రయించ వచ్చని తెలిపాడు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో ధర రూ.250 నుంచి రూ.300 వరకు పలుకుతోంది. పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరికొందరు రైతులు ఈ పంట సాగుకు ముందుకు వచ్చే అవకాశం ఉంది.